# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## జాతీయ వార్తలు

తేదీ: 19-03-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం ఈరోజు సమావేశమయ్యింది.
- ❖ క్రూ 9 మిషన్ భూమిపైకి సురక్షితంగా తిరిగి రావడం వెనుక ఉన్న నాసా బృందాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీ అభినందించారు.
- ❖ దేశ వ్యాప్తంగా ప్రస్తుతం 15 వేల జన్ ఔషధి ఔషధి కేంద్రాలు పని చేస్తున్నాయని ఆరోగ్య మంత్రి జె పి నడ్డా తెలిపారు.
- ❖ భారతదేశం 2035 నాటికి తన సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా కృషి చేస్తుందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ తెలియజేశారు.
- ❖ ప్రధానమంత్రి నరేంద్రమోదీ “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.

========================

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం ఈరోజు న్యూ ఢిల్లీలో సమావేశమయ్యింది. మహారాష్ట్రలోని జెఎన్‌పిఎ పోర్ట్ నుండి చౌక్ వరకు ఆరు వరుసల గ్రీన్‌ఫీల్డ్ హై-స్పీడ్ జాతీయ రహదారి నిర్మాణానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. భారతదేశ పాడి పరిశ్రమను ఆధునీకరించాలనే లక్ష్యంతో సవరించిన జాతీయ పాడి పరిశ్రమ అభివృద్ధి కార్యక్రమం (NPDD)కి కేంద్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ పథకానికి అదనంగా వెయ్యి కోట్ల రూపాయలు కేటాయించడంతో 15వ ఆర్థిక సంఘం కాలానికి మొత్తం బడ్జెట్ వ్యయం 2,790 కోట్ల రూపాయలకు చేరుకుంది. 3,400 కోట్ల రూపాయల కేటాయింపులతో సవరించిన రాష్ట్రీయ గోకుల్ మిషన్ కు ఈ సమావేశంలో ఆమోదం లభించింది. తక్కువ విలువ కలిగిన BHIM-UPI లావాదేవీలను ప్రోత్సహించడానికి 1,500 కోట్ల రూపాయల వ్యయంతో ప్రోత్సాహక పథకాన్ని కేంద్ర మంత్రివర్గం ఆమోదించిందని సమాచార ప్రసార శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ పాత్రికేయులకు వివరిస్తూ...

(వాయిస్ 39 సెకన్లు)

=========================

క్రూ 9 మిషన్ భూమిపైకి సురక్షితంగా తిరిగి రావడం వెనుక ఉన్న నాసా బృందాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభినందించారు. సునీతా విలియమ్స్ బృందం యొక్క పట్టుదల, అంకితభావం అందరికీ స్ఫూర్తినిచ్చిందని సామాజిక మాధ్యమం లో పేర్కొన్నారు. అదేవిధంగా క్రూ మిషన్ భూమిపై సురక్షితంగా తిరిగి రావడానికి అవిశ్రాంతంగా కృషి చేసిన వారి ప్రయత్నాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సామాజిక మాధ్యమం లో ప్రశంసించారు. కఠినమైన పరిస్థితులను ఎదుర్కొంటున్న వారి అచంచలమైన సంకల్పం లక్షలాది మందికి స్ఫూర్తిదాయకమని అభివర్ణించారు.

=========================

పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో భాగంగా ఈరోజు లోక్ సభను సభాపతి ఓం బిర్లా ప్రశ్నోత్తరాలతో ప్రారంభించారు. ఈ సందర్భంగా ముందుగా సునీతా విలియమ్స్ బృందానికి శాస్త్ర సాంకేతిక శాఖ సహాయ మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు సభ్యులు అడిగిన ప్రశ్నలకు సమాధానమిస్తూ... భారతదేశం 2035 నాటికి భారత అంతరిక్ష కేంద్రం పేరిట తన సొంత అంతరిక్ష కేంద్రాన్ని ఏర్పాటు చేసేలా కృషి చేస్తున్నామన్నారు. నిర్దేశించుకున్న ప్రణాళిక ప్రకారం అన్నీ సజావుగా జరిగితే 2040 నాటికి భారతీయ వ్యోమగామి చంద్రుడిపైకి చేరుకుంటారని విశ్వాసం వ్యక్తం చేశారు. చంద్రయాన్-4 రెండు ప్రయోగ వాహక నౌకల ద్వారా ప్రయోగించబడుతుందని జితేంద్ర సింగ్ వివరిస్తూ....

(వాయిస్ 36 సెకన్లు)

=========================

గాజాలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితిపై భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ఈరోజు ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేస్తూ.. బందీలను విడుదల చేయాల్సిన ప్రాముఖ్యతను ప్రస్తావించింది. గాజా ప్రజలకు మానవతా సహాయం నిరంతరం అందించాలని పిలుపునిచ్చింది.

=========================

దేశ వ్యాప్తంగా ప్రస్తుతం 15 వేల జన్ ఔషధి ఔషది కేంద్రాలు పని చేస్తున్నాయని ఆరోగ్య మంత్రి జె పి నడ్డా తెలిపారు. రానున్న రెండు సంవత్సరాల్లో మరో 10 వేల ఔషద కేంద్రాలను ప్రారంభించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలియజేసారు. ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ పనితీరుపై రాజ్యసభలో ఈరోజు జరిగిన చర్చ లో జె పి నడ్డా మాట్లాడుతూ... జన్ ఔషధి కేంద్రాల్లో సరసమైన ధరల్లో మందులు అందుబాటులో ఉండటంతో ఇప్పటివరకు రోగులకు 3 వేల కోట్ల రూపాయలు ఆదా అయిందని వెల్లడించారు. ప్రభుత్వం ఆయుష్‌తో పాటు అల్లోపతిపై కూడా దృష్టి సారించిందని కేంద్రమంత్రి మాట్లాడుతూ....

(వాయిస్ 42 సెకన్లు)

విరామం

=========================

దేశంలో మెరుగైన పంటలు, బలమైన ఆరోగ్య సంరక్షణ, వాతావరణ స్థితిస్థాపకత కోసం ఆర్టిఫిషల్ ఇంటిలిజెన్స్ (AI) దోహదపడుతుందని కేంద్ర ఐ.టి. శాఖా మంత్రి అశ్విని వైష్ణవ్ అన్నారు. న్యూఢిల్లీలో బిల్ అండ్ మెలిందా గేట్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బిల్ గేట్స్‌ను కలిసిన అనంతరం మాట్లాడుతూ, ఇండియా AI మిషన్, బిల్ అండ్ మెలిండా గేట్స్ ఫౌండేషన్ మధ్య కుదిరిన అవగాహన ఒప్పందంపై త్వరలో సంతకం చేయనున్నామని తెలిపారు.

========================

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 120వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

========================

ప్రపంచ దేశాలు తమ జాతీయ భద్రతా దృష్ట్యా వాణిజ్య నిర్ణయాలు తీసుకుంటున్నాయని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వ్యాఖ్యానించారు. న్యూఢిల్లీలో ఈరోజు జరిగిన రైసినా డైలాగ్ 2025లో ఆయన ప్రసంగిస్తూ.. మునుపెన్నడూ లేని విధంగా ప్రపంచ ఆర్థిక వ్యూహాలలో కీలక మార్పులు చోటుచేసుకున్నాయన్నారు. ప్రపంచ దేశాలు ఇప్పుడు ఖర్చు-సమర్థత కంటే సురక్షితమైన నమ్మదగిన భాగస్వామ్యాలకు ప్రాధాన్యత ఇస్తున్నాయని చెప్పారు. భారతదేశం ప్రస్తుతం యూరోపియన్ యూనియన్, అమెరికా, ఇంగ్లాండ్ లతో వాణిజ్య చర్చలలో పాల్గొంటోందని తెలిపారు. భారత్ అగ్రగామి దేశాల్లో ఒకటిగా నిలవాలని కోరుకుంటోందని జైశంకర్ మాట్లాడుతూ...

(వాయిస్ 36 సెకన్లు)

========================

చండీగఢ్‌లో నిరసన తెలుపుతున్న పంజాబ్ రైతులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధుల మధ్య ఈరోజు చర్చలు జరిగాయి. కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, వాణిజ్య మంత్రి పియూష్ గోయల్, వినియోగదారుల వ్యవహారాల మంత్రి ప్రహ్లాద్ జోషి కేంద్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించగా పంజాబ్ వ్యవసాయ మంత్రి గుర్మీత్ సింగ్ ఖుడియాన్, ఆర్థిక మంత్రి హర్పాల్ సింగ్ చీమా, క్యాబినెట్ మంత్రి చేతన్ సింగ్ జౌరామజ్రా పంజాబ్ రాష్ట్ర ప్రభుత్వానికి ప్రాతినిధ్యం వహించారు. రైతుల తరపున సంయుక్త కిసాన్ మోర్చా అధ్యక్షులు జగ్జిత్ సింగ్ దల్లెవాల్, కిసాన్ మజ్దూర్ మోర్చా అధిపతి సర్వాన్ సింగ్ పాంధర్ కూడా ఈ చర్చల్లో పాల్గొన్నారు.

========================

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజ కూడా లాభాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 75,301 పాయింట్ల వద్ద లాభాల్లో ప్రారంభమై... చివరికి 148 పాయింట్ల లాభంతో 75,449 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 73 పాయింట్లు లాభపడి 22,907 వద్ద ముగిసింది. డాలరుతో రూపాయి మారకం విలువ 86.44గా ఉంది.

========================
========================